epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 102 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 4 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



### లడ్డూ కల్తీ సూత్రధారుల్ని తేల్చేందుకు

# విచారణ కమిటీ

**మంత్రివర్గ సమావేశంలో అజెండా కాదని తిరుమల లడ్డూ కల్తీపై చర్చ**

- 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు
- కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు
- మూడున్నర గంటల పాటు మంత్రివర్గ సమావేశం
- సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందన్న మంత్రివర్గం
- అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం

5

# అమెరికా టారిఫ్ తగ్గింపు.. ఆక్వా రంగానికి ఊపు


- సముద్ర ఆహార ఎగుమతులు 15 శాతం పెరిగే అవకాశం
- రైతులు, మత్స్యకారులకు ఆదాయం పెరుగుతాయి
- ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం
- వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

5



**అమరావతి:** అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి అభివద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం కింద ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. గతంలో 25 శాతం టారిఫ్‌కు అదనంగా శిక్షాత్మక టారిఫ్‌లతో కలిపి మొత్తం

- మిగతా 5లో



### చట్టాలను పాటించకపోతే..

# దేశం నుంచి వెళ్లిపోండి

### దేశ గోప్యతను అడ్డుకోలేరు

- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

4

### 'పంచాయతీ' ఫలితాలే

# రిపీట్ కావాలి

**90% స్థానాలే లక్ష్యం**
**అసంతృప్త నేతలను బుజ్జగించండి..**
**క్షేత్రస్థాయికి వెళ్లండి**
**మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం**

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ మంగళవారం సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు సీఎం రేవంత్. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు.

మిగతా 2 లో



### వరంగల్ జూలో తెల్లపులి మృతి

వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

.. వివరాలు 2లో



### గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు

# నో అబ్జెక్షన్

- సుప్రీంకోర్టు స్పష్టత

.. వివరాలు 2లో



### రెండోరోజూ ఉభయసభల్లో

# గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా

4

# రైతులతో తుమ్మల ముఖాముఖి

**రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**
**యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు**
**ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన నాగేశ్వరరావు**

2

తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.






విజయ డయాగ్నస్టిక్‌కు

# జరిమానా

గర్భిణికి ఎన్‌టీ స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

.. వివరాలు 2లో

# మేడారం జాతర సక్సెస్



3

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి సీతక్క



# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

సీఎస్ రామకృష్ణారావు

2

### రేవంత్‌ను చూసి యువత

# ఛీ కొడుతోంది

నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

తొలిఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు

3





## ‘పంచాయతీ’ ఫలితాలే రిపీట్ కావాలి

మొదటి పేజీ తరువాయి

అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు. అదే విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలతోపాటు పలు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. నామినేషన్ల విత్ డ్రా సైతం నేటితో ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13వ తేదీన వెలువడనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే ఎవరికి వారు రంగంలోకి దిగి తమ సత్తా చాటేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి.

## వరంగల్ జూలో తెల్లపులి మృతి

### వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

**వరంగల్, ఫిబ్రవరి 3:** నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

## నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు నో అబ్జెక్షన్: సుప్రీం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## విజయ డయాగ్నస్టిక్ సెంటర్కు భారీ జరిమానా

### గర్భిణికి ఎన్టీ స్కాన్లో తప్పుడు రిపోర్టు




**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్లోని దిల్స-ుఖ్నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నొస్టిక్ సెంటర్ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

# రైతులతో తుమ్మల ముఖాముఖి

- రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
- యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు
- తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు
- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి



**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

### వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

### అధికారులతో సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఎస్ కింద 5లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్లు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మేడారం జాతర విజయవంతం

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క



**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో ’తిరుగు జాతర’ జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం‘ అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో ’తిరుగు జాతర’ నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

# మరోమారు ఝలక్

### తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు




**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు




**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం

## రేవంత్ రెడ్డి విమర్శలపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 3: కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియక ముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. విద్వేష రాజకీయాలకు, నరంలేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు.ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అని ఘాటు విమర్శలు చేశారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అన్నారు. లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి..? నువ్వు అమెరికాలోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సు-స్పష్టమైందని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

# తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

**202 మరణాలతో తెలంగాణ రెండో స్థానం**

**దేశ వ్యాప్తంగా మొత్తం 1,075 మంది మృతి**




**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయి-నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు. నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.










# సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

**ఉచితాలను ప్రకటించడానికి కాదు ● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

**జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట**

**కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి**



**జగిత్యాల, ఫిబ్రవరి 3:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టికెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనుసన్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్టానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్టానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం : మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, ఫిబ్రవరి 3:** గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆర్ఎస్ బిజెపిల వ్లల ఒరిగేదేమి లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.





సంపాదకీయం

# ఏపీలో కల్తీ నెయ్యి మంటలు!

తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్దోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయార య్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్చకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగిపోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలో నిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెరిన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

# మన సహనమే విజయానికి బాట

- విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం
- అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ
- ఎన్డీఏ సమావేశంలో మోదీని సన్మానించిన ఎంపీలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

# రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ, వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్– అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్ధరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.మరోవైపు కాంగ్రెస్ నేతలు పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్ష, అధికార పక్షాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ఇకపై పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన ప్రశ్నలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

# ట్రేడ్ డీల్ పేరుతో దేశాన్ని అమ్మేశారు..

- అమెరికా ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు
- అదానీ కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే మోదీకి భయం పట్టుకుంది
- రైతుల రక్తాన్ని, కష్టాన్ని ధారబోశారంటూ విమర్శల వర్షం
- మోదీపై రాహుల్ గాంధీ నిప్పులు!
- లోక్‌సభలో విపక్ష నేత ఆరోపణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్–అమెరికా మధ్య అకస్మాత్తుగా కుదిరిన వాణిజ్య ఒప్పందం (ట్రేడ్‌డీల్) పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్.. ఈ ఒప్పందం వెనుక భారీ కుట్ర దాగి ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై సోమవారం రాత్రి హడావుడిగా సంతకాలు చేయడంపై రాహుల్ పలు ప్రశ్నలు సంధించారు. ప్రధాని మోదీకి రెండు ప్రధాన అంశాల వల్ల భయం పట్టుకుందని ఆయన విమర్శించారు. అమెరికాలో గౌతమ్ అదానీపై కొనసాగుతున్న కేసు వాస్తవానికి ప్రధాని మోదీ ఆర్థిక మూలాలపై జరుగుతున్న దాడి అని, అందుకే మోదీ వణుకుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. అమెరికా వద్ద ఉన్న ఎప్‌స్టీన్ రహస్య ఫైల్స్‌లో మరిన్ని సంచలన విషయాలు ఉన్నాయని, అవి బయటకు వస్తాయనే భయంతోనే మోదీ అమెరికా చెప్పినట్లు వింటున్నారని ఆరోపించారు. "వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించుకున్న మోదీ ఇమేజ్ అనే బెలూన్ ఏ క్షణమైనా పేలవచ్చు. ట్రంప్ ఒత్తిడి వల్ల భారతీయ రైతుల రక్తాన్ని, శ్రమను మోదీ అమ్మేస్తున్నారు" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. అమెరికా నుంచి వస్తువుల దిగుమతిపై సుంకాలను ఎత్తివేయడం వల్ల దేశీయ వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు లోక్‌సభలో మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం. నరవణే ఆత్మకథలోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ ప్రయత్నించగా అధికార పక్షం తీవ్రంగా అడ్డుకున్నది. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వకపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అని రాహుల్ ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. దీనిపై స్పందించిన స్పీకర్.. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు.

# చట్టాలను పాటించకపోతే.. దేశం నుంచి వెళ్లిపోండి

## మెటాపై సుప్రీం ఆగ్రహం

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది సరికాదని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.

### ఏమిటీ ప్రైవసీ పాలసీ?

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సాప్‌బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది.

# అరవ శ్రీధర్‌కు నిద్ర లేని రాత్రులు



**కడప :** జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో బాధితులు ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. రోజుకొక వీడియోతో ఆయనకు నిద్ర లేకుండా చేస్తోంది. ఓవైపు అధికారికంగా విచారణ సాగుతున్న టైంలోనే ఇలా ఒక్కో వీడియోతో సంచలనం రేపుతోంది. ఆమె డీఫ్‌ఫేక్ వీడియోలతో అసత్య ఆరోపణలు చేస్తుందని ఎమ్మెల్యే వర్గం కవర్ చేస్తుంటే ఆమె మాత్రం తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెబుతోంది. అందుకు తగ్గట్టుగానే వీడియోలు రిలీజ్ చేస్తోంది. తాజాగా అసెంబ్లీ నుంచి బాధితురాలికి వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీడియో వదిలారు బాధితురాలు. తాజాగా బయటపడిన వీడియో వివరాల ప్రకారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అరవ శ్రీధర్ బాధితురాలితో వీడియో చాటింగ్ చేస్తున్నట్టు ఉంది. సభలో ప్రజా సమస్యలు లేవన్నట్టు అసెంబ్లీ ప్రాంగణం నుంచే మహిళకు వీడియో కాల్ చేసి అసభ్యకరమైన రీతిలో మాట్లాడటంపై వైసీపీతోపాటు నార్మల్ నెటిజన్లు ఆన్‌లైన్‌లో విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీ గౌరవ మర్యాదలు కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఉన్న అరవ శ్రీధర్ తనను రేప్ చేసి ఐదు సార్లు అబార్షన్ అయ్యేలా చేశారని బాధితురాలు నాలుగు రోజుల క్రితం మీడియా ముందుకు వచ్చారు. తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని తనను వేధింపులకు దిగారని ఆరోపించారు. దీనిపై పార్టీ పెద్దలకు, ప్రభుత్వ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని అందుకే మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. మీడియాతో మాట్లాడిన ఆమె తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తాను డబ్బుల కోసమే, లేకుండా ఎమ్మెల్యేను పెళ్లి చేసుకోవాలని ఉద్దేశంతో ఇదంతా చేయలేదని, తనకు న్యాయం జరగాలని ఆయనకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. తాను పాతిక కోట్లు డిమాండ్ చేసిందని అబద్ధమని చెప్పారు. తన వెనుక వైసీపీ ఉందనే ప్రచారాన్ని కూడా బాధితురాలు ఖండించారు. ఈ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి శ్రీధర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన తప్పు లేదని తనను బ్లాక్ మెయిల్ చేయడానికి సదరు మహిళ డీప్‌ఫేక్ వీడియోలతో పరువు తీస్తున్నారని ఆరోపించారు. కచ్చితంగా మహిళ అసలు రూపం తెలుస్తుందని అన్నారు. ఇంతలో జనసేన పార్టీ కూడా ఈ వివాదంపై స్పందించి విచారణకు కమిటీ వేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విచారణ పూర్తి అయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేకు సూచించారు. అయితే ఈ వివాదం మొదలైనప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటమే కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది

### రంగంలోకి హ్యూమన్ రైట్స్ కమిషన్

వివాదం దుమారం రేపడంతో జనసేన పార్టీ అంతర్గత విచారణకు ఆదేశించింది. పార్టీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని సమాచారం. ఇప్పటివరకు బయటకు వచ్చిన వీడియోలు, అందులో కనిపిస్తున్న అంశాలు, వాటి నిజానిజాలపై కమిటీ సమగ్రంగా పరిశీలన జరుపుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు ఆరోపణలు చేసిన వీణను కూడా కమిటీ ప్రత్యక్షంగా కలసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి తొలి వారంలో జనసేన అంతర్గత విచారణ కమిటీ రైల్వే కోడూరు ప్రాంతంలో పర్యటించనుందని సమాచారం. అక్కడ స్థానిక స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి ఒక నివేదిక సిద్ధం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నివేదిక ఆధారంగా పార్టీ క్రమశిక్షణ చర్యలు ఏవైనా ఉంటే తీసుకుంటామని స్పష్టంగా తెలియజేశారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే సమాచారం సేకరించారని, పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం మరో కీలక దశకు చేరింది. వీణ తాజాగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను ఆశ్రయించారు. తనపై లైంగిక దాడి జరిగిందని, పెళ్లి హామీతో మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదును ఆమె తరఫున న్యాయవాది ఆజాద్ దాఖలు చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఫిర్యాదును స్వీకరించి విచారణకు అంగీకరించడంతో ఈ కేసు జాతీయ స్థాయిలోనూ దృష్టిని ఆకర్షిస్తోంది. అదే సమయంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించారు. ఆమె వీణతో ఫోన్‌లో మాట్లాడి ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిజాలు వెలికి తీసి బాధితురాలికి న్యాయం చేయడానికి కమిషన్ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటితో ఈ వ్యవహారం కేవలం రాజకీయ అంశంగా కాకుండా, చట్టపరమైన, మానవ హక్కుల కోణంలోనూ కీలకంగా మారింది. అంతర్గత పార్టీ విచారణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ చర్యలు, మహిళా కమిషన్ స్పందన నేపథ్యంలో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

# ముద్రగడ దారెటు..



**కాకినాడ :** కాపు నాయకుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం నుంచి ఎంతోమంది రాజకీయంగా ఎదిగినా, రిజర్వేషన్ ఉద్యమం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఆయన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ఒకే దిశలో సాగలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉద్యమ నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందినప్ప టికీ, కొన్ని సందర్భాల్లో అదే సామాజిక వర్గానికి వ్యతిరేకంగా ఆయన వైఖరి కనిపించిందని రాజకీయ విశ్లేషకులు అంటారు. ఇటీవల జరిగిన 2024 ఎన్నికల్లో ఆయన ఇచ్చిన పిలుపును కాపు వర్గం పెద్దగా పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా జనసేన పార్టీ పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఓటమి కోసం ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేకపోయా యి. ఎన్నికల ఫలితాల అనంతరం జగన్మోహన్ రెడ్డిను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పోరాడతానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఆ సమయంలోనే ఆయన అనారోగ్యానికి గురికావడంతో రాజకీయంగా చురుగ్గా ముందుకు సాగలేకపోయారు. ముద్రగడ రాజకీయ జీవితం ప్రారంభ దశలో ఎంపీగా, మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కానీ ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఓడిపోవడం ఆయనను తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. ఆ ఓటమి తరువాత తీసుకున్న కొన్ని నిర్ణయాలు రాజకీయంగా సరైనవి కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం వయసు పెరిగిపోవడం, ఆరోగ్య సమస్యలు ఉండటంతో తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ఎన్నికలకు ముందు ఆయన జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. గౌరవం ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధమని ఆయన సంకేతాలు పంపినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదట పవన్ సానుకూలంగా స్పందించినా, ఆ తర్వాత పరిస్థితులు మారడంతో ముద్రగడ మనస్తాపానికి గురయ్యారని అంటారు. అదే సమయంలో ఆయన తాడేపల్లి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఆయనకు గౌరవం లభించినప్పటికీ, పార్టీ భవిష్యత్తుపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో పవన్ ప్రభావం కొనసాగుతుండటం, వైసీపీ బలహీనంగా కనిపించడంతో 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి అవకాశాలు తక్కువేనన్న చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముద్రగడ ఆలోచన మారుతున్నట్టు రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవల టీడీపీకి చెందిన సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తో ఆయన భేటీ కావడం మరింత ఆసక్తిని రేపింది. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని చెప్పినా, దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుమారుడి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా ముద్రగడ కూటమి పార్టీల వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడుతోంది. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎదురైన నష్టాన్ని సరిదిద్దుకునే ప్రయత్నంగా దీనిని కొందరు భావిస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో నిజం ఎంతుందో, ఆయన తదుపరి అడుగు ఏమిటో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

# ఏఐ సిటీగా అమరావతి

**విజయవాడ :** రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా జ్ఞానం, సాంకేతికతకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ఆలోచన వెనుక రాష్ట్ర యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి, అధిక వేతన ఉద్యోగాలు సృష్టించాలనే దృఢ సంకల్పం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలనే దృష్టితో ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగా రాజధాని పరిధిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ సౌకర్యాలు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీనికి అనుబంధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయాన్ని వచ్చే నెల 19న ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమరావతి పేరు వినగానే సాంకేతికత గుర్తుకొచ్చేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్న ఆలోచనతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని అధికారులు చెబుతున్నారు. నగర నిర్మాణం నుంచి గుర్తింపు వరకు ప్రతీ అంశంలో టెక్నాలజీ కనిపించాలనే ఉద్దేశంతో అమరావతిని "ఏఐ సిటీ"గా నిలబెట్టాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ఈ దిశగా అమరావతి పేరుతోనే ఏఐ భావన ప్రతిబింబించేలా ప్రత్యేక లోగో రూపకల్పన చేయాలన్న ఆలోచన కూడా తీసుకొచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్విడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో వచ్చే రెండేళ్లలో రాష్ట్రానికి చెందిన దాదాపు పది వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో శిక్షణ అందించనున్నారు. అంతేకాకుండా అమరావతిలో స్టార్టప్



సంస్కృతిని ప్రోత్సహించేలా అవసరమైన మద్దతు కూడా ఈ విశ్వవిద్యాలయం ద్వారా లభించనుందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ విప్లవం వేగంగా విస్తరిస్తోంది. అమెరికా తర్వాత ఎక్కువ సంఖ్యలో ఏఐ నైపుణ్యం కలిగిన యువత భారత్‌లోనే ఉన్నారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుని, రాష్ట్రాన్ని కేవలం సేవలు అందించే స్థాయిలో కాకుండా, సాంకేతికతను సృష్టించే స్థాయికి తీసుకెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. గతంలో హైదరాబాద్ ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన అనుభవం ఉన్న చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని గ్లోబల్ డిజిటల్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏఐ చుట్టూనే తిరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో, ప్రతి కుటుంబం నుంచి ఒక ఏఐ నిపుణుడు తయారవ్వాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రచిస్తున్నారని చెబుతున్నారు. ఈ ప్రయత్నాల ద్వారా మధ్యతరగతి ఆదాయాలు పెరగడమే కాకుండా, రాష్ట్రం భవిష్యత్ తరాలకు బలమైన సాంకేతిక పునాది వేయనుందని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## లడ్డూ కల్తీ సూత్రధారుల్ని తేల్చేందుకు

# విచారణ కమిటీ

**అమరావతి:** అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల లడ్డూ కల్తీ వ్యవ హారంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. సమావేశం అనంతరం మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. "సీఎఫ్‌టీఆర్ఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలి? కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4 లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదు" అని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు.

### మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. దీని వల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని వెల్లడించారు. ఎక్సైజ్ అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు విక్రయాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు

### త్వరలో నంది అవార్డులు

-మొదటిపేజీ తరువాయి

పోటీల్లో గెలుపొందిన విజేతలను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో లఘు చిత్రాలు రూపొందించిన యువ దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ చలన చిత్ర పరిశ్రమ అభివద్ధిలో భాగంగా జనవరి 11న రాష్ట్రస్థాయిలో ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ప్రతిష్టాత్మకంగా 'మాఏపి' ఆధ్వర్యంలో తెనాలిలో ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 ను విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల నిర్వాహకుడు,మాఏపీ వ్యవస్థాపకులు, సినీదర్శకులు దిలీప్ రాజా కషిని కొనియాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల నిర్వహణపై ప్రకటన చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు ధీటుగా అమరావతిని సినిమా రంగానికి కేంద్రబిందువుగా మార్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. సామాజిక చైతన్యంతో కూడినటువంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకులు దిలీప్ రాజా ఏపీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివద్ధి చేయాలని నిరంతరం తపిస్తున్నారని అన్నారు. సినిమా రంగం అభివద్ధికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేవలం ఆంధ్ర ప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారులను మాత్రమే ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 203 షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలురాగా 2 వేల మంది నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖర్ శకునాల తీసిన ' మహావక్షం' ప్రథమ బహుమతిని పొందగా శ్రీకాకుళంకు చెందిన శ్రీనివాసరావు 'సింహాద్రి అప్పన్న' ద్వితీయ బహుతిని, పాలకొల్లుకు చెందిన నవీన్ కుమార్ ' అబద్దం వర్సెస్ నిజం' తతీయ బహుమతిని పొందింది. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు లక్ష రూపాయల నగదును అందించారు. ఉత్తమ నటిగా సుజిత( మనం), ఉత్తమ కేరెక్టర్ నటిగా సాయి ప్రకర్ష ( అబద్దం వర్సెస్ నిజం) నటుడు పవన్ శర్మ( మన్నుమిన్ను) బాలనటి హర్షతున్నీసా,యంగ్ టాలెంట్ రిత్విక్ రెడ్డి (అస్త్ర) త్రివిక్రమ్ (డెబ్యూ డైరెక్టరు ) విలన్ మీసాల భాస్కర్,తెలుగు స్క్రిప్ట్ పరిశీలకులు మంజులూరి లక్ష్మీపతి మాస్టర్, జగదీష్,దర్శకత్వం నరేష్ దోనె తదితరులను సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఏపీ యువత అద్భుతాలు సష్టించగలరని, ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. మరింత ప్రోత్సాహం అందిస్తే ఎవరెస్ట్ నైనా ఎక్కగలమనే దఢ సంకల్పాన్ని విజేతల్లో నింపామని దిలీప్ రాజా పేర్కొన్నారు.

### అమెరికా టారిఫ్ తగ్గింపు..

### ఆక్వా రంగానికి ఊపు

-మొదటిపేజీ తరువాయి

5058 శాతం వరకు టారిఫ్ భారం పడటంతో, 2025 ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో అమెరికాకు భారతదేశం నుంచి జరిగే సముద్ర ఆహార ఎగుమతులు పరిమాణంలో సుమారు 15 శాతం తగ్గి 2.01 లక్షల మెట్రిక్ టన్నులకు, విలువలో 6.3 శాతం తగ్గి 1.72 బిలియన్ అమెరికన్ డాలర్లకు పడిపోయాయని గుర్తు చేశారు. ముఖ్యంగా అమెరికాకు ప్రధానంగా ఎగుమతి అయ్యే ఫ్రోజెన్ ష్రింప్ ఈ పరిస్థితి వల్ల తీవ్రంగా ప్రభావితమైందన్నారు. టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని, నిలిచిపోయిన కొత్త ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతూ, బాండెడ్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకును విడుదల చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే నెలల్లో అమెరికాకు సముద్ర ఆహార ఎగుమతులు 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, 202526 రెండో అర్ధభాగంలో ఎగుమతులు టారిఫ్‌కు ముందు ఉన్న స్థాయికి చేరుకునే అవకాశముందని చెప్పారు. ఈ పరిణామంతో సముద్ర ఆహార ప్రాసెసింగ్ రంగంలోని లాభ మార్జిన్లు కూడా మెరుగవుతాయని, అధిక టారిఫ్ కాలంలో 55.5 శాతానికి తగ్గిన ప్రాసెసర్ల మార్జిన్లు టారిఫ్ తగ్గింపు అనంతరం తిరిగి 78 శాతం స్థాయికి చేరే అవకాశముందన్నారు. కేంద్ర బడ్జెట్ 2026లో సముద్ర ఆహార ప్రాసెసింగ్‌కు అవసరమైన ఇన్‌పుట్స్‌పై కల్పించిన డ్యూటీ రాయితీలు ఈ రంగానికి అదనపు మద్దతును అందించనున్నాయని తెలిపారు. అమెరికా మార్కెట్ పునరుద్ధరణతో పాటు యూరోపియన్ యూనియన్, చైనా, వియత్నాం, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి అమెరికేతర మార్కెట్లకు

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దృష్ట్యా

- తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో ఒరియెంటేషన్ మరియు ట్రైనింగ్ కార్యక్రమం
- పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** మునిసిపల్ ఎన్నికల నిర్వహణ దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆన్లైన్ విధానంలో ఏర్పాటు చేసిన ఒరియెంటేషన్ మరియు ట్రైనింగ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట అమలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, జిల్లాలో మునిసిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం, గస్తీ చర్యలను మరింత బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. అదేవిధంగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మద్యం, నగదు, బహుమతుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద విషయాలు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలు,కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించిన మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్, ఐఏఎస్



**మరిపెడ ఫిబ్రవరి3( సమయం న్యూస్).:** జిల్లా వ్యాప్తంగా (5) మున్సిపల్ పరిధిలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ లలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియన ఏర్పాట్లను మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, సెంట్ అగస్టిన్ హై స్కూల్ కౌంటింగ్ కేంద్రం ను పరిశీలించారు, ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అధికారులు పక్కాగా సౌకర్యాలను కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం ముగిసే వరకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు త్రాగునీరు, చైర్స్, టెంట్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య బృందం ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు, పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలించే క్రమంలో రిటర్నింగ్ అధికారులు పోలీస్ భద్రతా సిబ్బంది మధ్య పోలింగ్ బాక్సులు తరలించాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార ముందస్తు అనుమతులు, ఖర్చుల వివరాలు, తదితర అనుమతులను సమయం లోగా తీసుకునే విధంగా అభ్యర్థులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు,మరిపెడ కేంద్రంలోనీ సెంట్ ఆగస్టిన్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు,జనరల్ అబ్జర్వర్ వెంట నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, స్థానిక మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది కృష్ణ ప్రసాద్, ప్రవీణ్ ఉన్నారు.

## 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మిట్టి లలితా మహేష్ మల్రెడ్డిపల్లి 1వ వార్డులో ఇంటింటి ప్రచారం



**తాండూర్ మున్సిపల్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** తాండూరు మున్సిపల్ దపట్టణంలోని 1వ వార్డు మల్రెడ్డిపల్లి గ్రామంలో మిట్టి లలితా మహేష్ కాంగ్రెస్ పార్టీ తరపు నుండి పోటీ చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 1వ వార్డులో ప్రచారం చేపట్టారు. మంగళవారం నాడు వార్డులో పర్యటించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు. చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగేష్ సీనియర్ నాయకులు కురువ మైపాల్. సర్దార్ ఖాన్ మల్లన్న. మహమ్మద్ ఇక్బాల్. రాజు. బొంబాయి అంజన్న. బలరాం. పాండు యూత్ శ్రీకాంత్. తదితరులు పాల్గొన్నారు...

## రానున్న వేసవి కాలం లో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు.

- నగర మేయర్ గుండు సుధారాణి.
- కమిషనర్ చాహత్ వాజ్ బాయి తో కలిసి సమీక్షా



**వరంగల్ ఫిబ్రవరి3( సమయం న్యూస్).:** సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహేత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేసిన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి... ఈ కార్యక్రమం లో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు ఈ ఈ రవి కుమార్ మహేందర్ సంతోష్ బాబు మాధవి లత డిఈ లు ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం పెరిగేలా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, ఫిబ్రవరి 3:( సమయం న్యూస్ ) :** పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం మెరుగుపర్చి, రీడింగ్ స్కిల్స్ పెంపొందేలాగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వైరా మండలం పాలడుగు గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో నిర్వహిస్తున్న ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ విద్యా బోధనను పరిశీలించారు. మూడవ, నాలుగు తరగతి గదులలో విద్యార్థులను ప్రత్యేకంగా అందించిన రైమ్స్ ఎలావున్నాయి, అని అడిగారు. బోర్డు పై ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, పద్యాలు వ్రాసి వాటియొక్క ఉచ్చారణ, అర్థం చేసుకుంటూ, తిరిగి చెప్పగలుగుతున్నారా, ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తిస్తున్నారా అని అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని కిచెన్ లో వండిన అన్నం, కూరలను కలెక్టర్ పరిశీలించారు. భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. పాఠశాల పిల్లలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం మంచిగా ఉంటుందా, కోడిగుడ్డు మెనూ ప్రకారం పెడ్తున్నారా, కూరలు రుచిగా ఉంటున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఒక విద్యార్థికి చదివే సామర్థ్యం అందిస్తే జీవితాంతం ఉపయోగపడుతుందని, విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బోధన అందించాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థి గంట సేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక బుక్ లెట్ తయారు చేయడం జరిగిందని అన్నారు. బుక్లెట్ లో ఉన్న అంశాలను తూ.చ. తప్పకుండా ఉపాధ్యాయులు ఫాలో అవుతూ పిల్లలు చదివే సామర్థ్యం పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ పర్యవేక్షణకు ఒక యాప్ తయారు చేశామని, దీనిని యూ.డి.ఐ.ఎస్. తో అనుసంధానం చేసినట్లు, ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు అప్ డేట్ మాత్రం చేయాలని అన్నారు. ఆంగ్ల అక్షరాలను ఫోనెటిక్ సౌండ్ తో సహా నేర్పేలా కోర్సు డిజైన్ చేశామని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పరిపూర్ణంగా అమలు చేయవచ్చని, ప్రతి విద్యార్థి కనీసం ఒక పేరాగ్రాఫ్ చదివి అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి రోజు పాఠశాల సమయాల్లోనే ప్రాథమిక తరగతి విద్యార్థులకు అమలు చేయాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం భోజనంలో సన్నబియ్యం వాడాలని, వంటకాల కోసం గ్యాస్ సిలిండర్ లను ఉపయోగించాలని, ప్రభుత్వ మెను ప్రకారం రోజువారి వంటకాలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంను కలెక్టర్ సందర్శించారు. చిన్న పిల్లలకు అందించే కోడిగుడ్డు, పోషక ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దార్ సురేషు బాబు, మండల విద్యా అధికారి కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దయాకర్ రావు, రమేష్, శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ల ఉప సంహారణ కేంద్రాల పరిశీలన.



**జనగాం ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్).:** జనగాం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ (Withdrawals of Nominations) పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా జనగాం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ సజావుగా, ఎన్నికల నియమావళి ప్రకారం జరుగుతోందా లేదా అనే అంశాన్ని ఆయన సమగ్రంగా సమీక్షించారు. పరిశీలన సందర్భంగా... అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కౌంటర్ల నిర్వహణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు మరియు సమయపాలనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జనగాం పట్టణంలోని ఏకశిలా బి.ఎడ్. కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ కౌంటింగ్ హాల్స్, టేబుల్ అమరికలు, భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, త్రాగునీరు--శౌచాలయ సదుపాయాలు, విద్యుత్ సరఫరా మరియు ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై ఆయన విపులంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు..నామినేషన్ల ఉపసంహరణ నుండి కౌంటింగ్ వరకు ప్రతి దశ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలక మని...ప్రతి కేంద్రంలో చట్టబద్ధత, పారదర్శకత భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జనగాం, మున్సిపల్ కమిషనర్, జనగాం, తహసీల్దార్, జనగాం, జుణవీ, మాస్టర్ ట్రైనర్, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.





# తగు జాగ్రత్తలు తీసుకొని క్యా న్సర్ మహమ్మారిని దూరం చేయండి

- అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్ “అంతర్జాతీయ కాన్సర్ డే ”

**నారాయణపేట, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం నాడు “అంతర్జాతీయ కాన్సర్ డే ” సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట లోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి సహకారంతో విద్యార్థులతో కాన్సర్ వ్యాధి గురించి అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిదులుగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్,చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్ హాజరయ్యారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాన్సర్ మహమ్మారి గురించి తెలుసుకొని దానిని నిర్మూలించడానికి తమవంతు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇట్టి సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమనగా, క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం ఈ దినోత్సవం లక్ష్యం. క్యాన్సర్ అనేది ఒక మహమ్మారి వ్యాధి, దీనిని ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చు. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన కారణాలు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం, మద్యపానం, ధూమపానం. బాధ్యత గల పౌరులుగా మనవంతు భాగంగా, క్యాన్సర్‌ను నివారించడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం, కాలుష్యానికి దూరంగా ఉండడం, మద్యపానం, ధూమపానం మానేయడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వంటివి పాటించాలని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ కె. లక్ష్మీపతి విద్యార్థులతో మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి వైద్య పరీక్షలు అవసరమని క్రమం తప్పకుండా స్క్రీనింగ్ లాంటి పరీక్షలు చేయించుకోవాలని, సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ వీటి గురించి అవగాహన పెంచడం ద్వారా, మనం ఈ వ్యాధిని నివారించవచ్చు, ముందుగానే గుర్తించవచ్చు, మరియు సరైన చికిత్స పొందొచ్చని తెలిపారు. హాజరైన అతిధులు కాన్సర్ అవగాహనతో పాటు విద్యార్థులకు అవసరమైన చట్టాల గురించి అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమాన్నిజిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారు కళాశాలలో ఏర్పాటు చేసి విద్యార్థులకు కాన్సర్ పై అవగాహన కల్పించి, కాన్సర్ నిర్మూలనకు మన వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి కళాశాల భోధన, బోధనేతర సిబ్బంది తో పాటు కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, న్యాయ శాఖా సిబ్బంది పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**రాయపోల్,ఫిబ్రవరి 3:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన రంగారెడ్డి, కార్మికులకు ప్రతినెలా జీతాలు,బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం వారానికి మూడు గుడ్లు విద్యార్థులకు అందించాలని నిర్ణయించినప్పటికీ,ఒక్క గుడ్డుకు కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న రేటు రూ.6 మాత్రమేనని, ప్రస్తుతం మార్కెట్లో ఒక్క గుడ్డు ధర రూ.9కు పైగా ఉందని తెలిపారు. దీంతో ప్రతి గుడ్డుపై కార్మికులు అదనంగా రూ.3 భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనం సరిపోదని, కనీసం ప్రతినెల రూ.3,000 వంట ఖర్చుల బిల్లులు సకాలంలో చెల్లించాలని, మార్కెట్ ధరలకు అనుగుణంగా విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం కేటాయించే రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10,000 అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే మార్చి నెలలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని రంగారెడ్డి హెచ్చరించారు.

## సీఎం కప్--2025 క్రీడలు 4 నుంచి

**నిర్మల్ ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్):** సీఎం కప్--2025లో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఫిబ్రవరి 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీలు నిర్మల్‌లోని న్యూ కలెక్టరేట్ రోడ్ సమీప వాసవి వరల్డ్ స్కూల్ పక్కన ఉన్న మైదానంలో జరుగుతాయని పేర్కొన్నారు. అయితే అథ్లెటిక్స్ పోటీలు మాత్రం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తారని స్పష్టం చేశారు. స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఫిబ్రవరి 4న ఉదయం 8 గంటలకు వాసవి వరల్డ్ స్కూల్ మైదానంలో హాజరు కావాలని సూచించారు. టీమ్ గేమ్స్‌లో మండల స్థాయిలో ఎంపికైన జట్లు, వ్యక్తిగత క్రీడల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. క్రీడలను నేరుగా జిల్లా స్థాయి ఎంపికలకు పంపిస్తామని వెల్లడించారు

# ఉస్మానియా యూనివర్సిటీలో తొమ్మిది బస్తీల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోరుతూ వీసీతో డిప్యూటీ మేయర్ భేటీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:( సమయం న్యూస్)** దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థగా గుర్తింపు పొందిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న తొమ్మిది బస్తీల ప్రజల సమస్యలు మరోసారి చర్చకు వచ్చాయి. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాలుగారం ను కలిసి బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని తొమ్మిది బస్తీల్లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా మంచినీటి సరఫరా లోపం, దెబ్బతిన్న రహదారులు, నిరంతర విద్యుత్ అంతరాయాలు, పక్కా గృహాల లేమి వంటి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొం టున్నారని ఈ సందర్భంగా వీసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నప్పటికీ ఈ బస్తీల సమస్యలకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్చ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, ఈ విశ్వవిద్యాలయం దేశ విద్యా రంగానికి అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. అయితే, యూనివర్సిటీ ప్రాంగణంలోనే ఇన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ బస్తీల సమస్యలు విద్యా వాతావరణానికి, యూనివర్సిటీ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం అవసరం అని డిప్యూటీ మేయర్ స్పష్టం చేశారు. ఈ తొమ్మిది బస్తీలు కలిపి సుమారు 72 నుంచి 80 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయని, దీని వల్ల యూనివర్సిటీ భద్రత, విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఈ సమస్యకు పర్మనెంట్ సొల్యూషన్‌గా, బస్తీ ప్రజలకు సమీప ప్రాంతంలోనే సుమారు ఐదు ఎకరాల స్థలంలో డబుల్ బెడ్‌రూమ్ పక్కా ఇళ్లను నిర్మించి పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు. ఇలా చేస్తే మిగిలిన సుమారు 70 ఎకరాల విలువైన భూమి పూర్తిగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందుతుందని, యూనివర్సిటీ అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇన్నేళ్లుగా అక్కడే నివసిస్తున్న బస్తీ ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందని, అదే సమయంలో యూనివర్సిటీ క్యాంపస్ సరిహద్దులు స్పష్టంగా ఏర్పడి భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ యాజమాన్యం, జిహెచ్ఎంసీ సమన్వయంతో ఈ అంశంపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, "ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నగరానికి గర్వకారణం. ఇక్కడి అభివృద్ధికి అడ్డంకిగా మారిన సమస్యలను రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో పరిష్కరించాలి. బస్తీ ప్రజలకు న్యాయం జరిగేలా, యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని శాశ్వత నిర్ణయం తీసుకోవాలి" అని అన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాలుగారం ఈ ప్రతిపాదనలను సానుకూలంగా స్వీకరిస్తూ, సంబంధిత ప్రభుత్వ శాఖలతో సంప్రదించి పూర్తి నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ భేటీతో ఉస్మానియా యూనివర్సిటీలోని తొమ్మిది బస్తీల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడిందని బస్తీ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లాలో ఆహార కల్తీని కట్టడికి నిరంతర తనిఖీలు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్).:** మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ఆహార తనిఖీ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, వైద్య, విద్యా, పంచాయతి రాజ్, సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆహార భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వసతి గృహాలు, హోటళ్లు, భోజనశాలలు తదితర ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఎక్కడా కల్తీ ఆహారం విక్రయించబడకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా తీసిన ఫోటోలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో తప్పనిసరిగా పోస్ట్ చేయాలని, తద్వారా పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. నమూనాలు సేకరించి పరీక్షించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం, అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మెనూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆహార తనిఖీ అధికారి వరుణ్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, డిపిఓ శ్రీలత, మహదేవపూర్ సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం లో ఫిర్యాదులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.



**వికారాబాద్,ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఎస్పీ సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేసి న్యాయసమ్మతంగా పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని, ప్రతి పిర్యాదుపై నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరైనా తమ సమస్యలను భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. చట్ట పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే పోలీస్ శాఖ యొక్క బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, దీనివల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఎస్పీ తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండి ,ఎలాంటి తప్పులకు తావివ్వకూడదు.



## జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్ ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్) :** మంగళవారం మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, తహసీల్దారులు, మండల ఎంపీడీవోలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈరోజు(పిబ్రవరి 3 ) న సాయంత్రం 3.00 గంటల వరకు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థిత్వ ఉపసంహరణకు గడువు ముగుస్తుందని స్పష్టం చేశారు. ఉపసంహరణ ప్రక్రియ పూర్తైన అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను నమూనా-7 (ఫారం-7) లో నమోదు చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్‌ను సక్రమంగా రూపొందించాలని, నమూనా-7 తయారు చేసే సమయంలో అత్యంత జాగ్రత్త వహించాలని తెలిపారు. మొదట రాజకీయ పార్టీల బీ--ఫారమ్‌లు ఆధారంగా ఆయా అభ్యర్థులకు సరైన గుర్తులు కేటాయించాలని, అనంతరం స్వతంత్ర అభ్యర్థులు కోరుకున్న విధంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారికి గుర్తులు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శివేంద్ర ప్రతాప్, డి.ఆర్.డి.ఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మాస్టర్ శిక్షకులు బాలు యాదవ్ బైకాని నాగరాజు పాల్గొన్నారు.

# జిల్లాలోని 2 బీహెచ్‌కే గృహ సముదాయాల్లో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి .

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

**భూపాల పల్లి ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్) :** మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో గృహ నిర్మా ణ, పంచాయతీ రాజ్ (పీఆర్), రోడ్లు భవనాలు, గిరిజన ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, విద్యుత్తు శాఖల అధికారులతో మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2 బీహెచ్‌కే కాలనీల్లో అంతర్గత రహదారులు, త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరగకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి తదుపరి సమావేశంలో సమర్పించాలని, సమస్యలు ఉన్న చోట తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, పి ఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఈ ఈ రమేష్, మిషన్ భగీరథ ఈ ఈ శ్వేత, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఆశా డే నిర్వహణ.

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి.రవి రాథోడ్



**మహబూబాబాద్ ఫిబ్రవరి3( సమయం న్యూస్).:** మంగళవారం నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తల నెలసరి సమావేశ ముఖ్య ఉద్దేశ్యం ఆసుపత్రుల లో ప్రసవాలను నిర్వహించడం, తల్లి బిడ్డల ఆరోగ్యం పెంపొందించడం, మాతృ మరణాలను తగ్గించడం అని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఉప కేంద్రాల పరిధిలో 12 వారాల లోపు గర్భిణీ స్త్రీల నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలిని, సిజేరియన్ ఆపరేషన్ల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలను కోరారు. వ్యాధి నిరోధక టీకాలు 100 శాతం పూర్తయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కీటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగు, చికెన్ గునియా, ఫైలేరియా నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అలాగే, అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ కోసం 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి, ఆభా కార్డులో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, సుపెర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిసెప్షన్ , డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాట్ల ను పరిశీలించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు.



**జనగాం ఫిబ్రవరి3( సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమించబడిన జనరల్ అబ్జర్వర్ ఎ. నర్సింహా రెడ్డి ఘనపూర్, జనగాం మున్సిపాలిటీ పరిధిలోని నామినేషన్ ఉపసంహరణ కేంద్రం, డిస్ట్రిబ్యూషన్ / రిసెప్షన్ సెంటర్ మరియు స్ట్రాంగ్ రూమ్‌ను మంగళవారం సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. జనరల్ అబ్జర్వర్‌కు ఎన్నిక లకు సంబందించిన ప్రస్తుత ఏర్పాట్లు అలాగే తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారుఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన భద్రతా చర్యలు, మెటీరియల్ నిల్వ విధానం, సీసీ కెమెరా పర్యవేక్షణ, రికార్డ్ నిర్వహణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు అబ్సర్వర్ సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా... సజావుగా నిర్వహించడానికి అన్ని విధాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు నోడల్ ఆఫీసర్ మాతృ నాయక్ (గ్రాణ హౌసింగ్), సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీ-ఫారమ్ లు అందజేత.

● తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూర్ మున్సిపల్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** తాండూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో బీ--ఫారమ్‌లను పంపిణీ చేశారు. అభివృద్ధికి నిజాయితీగా పనిచేసే నాయకులను పార్టీ గుర్తించి అవకాశం ఇచ్చిందని ఆయన తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహనతో అభ్యర్థులు ముందుకు సాగాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి ఫిబ్రవరి3( సమయం న్యూస్).:** ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ క్రీడా మైదానంలోని మినీ ఫంక్షన్ హాల్‌ను, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్ల కోసం గదులను కలెక్టర్ పరిశీలించారు. అంబేద్కర్ స్టేడియంలో టెంట్లు ఏర్పాటు చేసి, వార్డు వారిగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి సమగ్రంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచేందుకు స్టేడియంలోని గదులలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లో గాలి, వెలుతురు లేకుండా కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలని సూచించారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం మినీ ఫంక్షన్ హాల్‌లో వార్డు వారిగా కౌంటర్లు ఏర్పాటు చేసి, బ్యారికేడింగ్ చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ సిబ్బందికి త్రాగునీరు, విద్యుత్ సరఫరా, టెంట్ల ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ హరి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోన, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన హోంగార్డుకి ఆర్థిక సాయం అందించిన ట్రాఫిక్ పోలీసులు



**హన్మకొండ ఫిబ్రవరి3( సమయం న్యూస్).:** హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ డి. శ్యామ్ బాబు గత నెల 22వ తారీఖున తన ఇంటి నిర్మాణం పనుల్లో నిమగ్నమై ఉండగా, ఆకస్మికంగా కుక్కలు మీదకు రావటంతో, కాలుజారి భవనం మీద నుండి కింద పడిన హోంగార్డుకు వెన్నుపూస, కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించి, గాయపడిన భాగాలకు శస్త్ర చికిత్సలు చేయించడంతో, పెద్ద మొత్తం చికిత్స ఖర్చు కావడం తో ఈ ఖర్చు హోంగార్డుకు భారం అయినట్లుగా భావించి వెంటనే స్పందించిన హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వంతు సహాయంగా 50వేల రూపాయలను సేకరించడం తో పాటు, హాస్పిటల్ యాజమాన్యంతో ముచ్చటించి, చెల్లించాల్సిన చికిత్స బిల్లులో మరో 45 వేల రూపాయల మినహాయింపు లభించడం జరిగింది. మంగళవారం హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి తన సిబ్బందితో కలిసి వెళ్లి, గాయపడిన హోంగార్డును పరామర్శించి, సిబ్బంది సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.

# ఎమ్మార్పీఎస్ నేతల పరామర్శ



**రాయపోల్,ఫిబ్రవరి 3:**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాయపోల్ మండల అధ్యక్షులు అయ్యగల్ల రవి మాదిగ తండ్రి అయ్యగల్ల పెంటయ్య మాదిగ అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అయ్యగల్లా పెంటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముక్కపల్లి రాజు మాదిగ మాట్లాడుతూ అనారోగ్య కారణాల వల్ల జరిగిన అకాల మరణం అత్యంత బాధాకరమని, వారు లేని లోటు ఎవరూ పూరించలేనిదని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ముంద్రాది కృష్ణ మాదిగ, ఉబ్బని ఆంజనేయులు మాదిగ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి శనిగారి రమేష్ మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర వాలీబాల్ పోటీలకు రాంసాగర్‌విద్యార్థి ఎంపిక



**రాయపోల్,ఫిబ్రవరి 3:**నిజామాబాద్‌లో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్--16 వాలీబాల్ పోటీలకు సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆర్. అభిలాష్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. పాఠశాల స్థాయిలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అభిలాష్ క్రీడల పట్ల ఉన్న అంకితభావం ప్రశంసనీయమని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజుకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అనీఫ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాబోయే విద్యా సంవత్సరం 2026 -27 కొరకు అడ్మిషన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది

## జిల్లా విద్యా శాఖాదికారి రేణుకా దేవి



**వికారాబాద్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా లోని అన్ని మోడల్ స్కూల్స్ లో 6 వ తరగతి లో ప్రవేశాలు మరియు 7 నుంచి 10 వ తరగతి వరకు మిగిలిన ఖాళీలకు, రాబోయే విద్యా సంవత్సరం 2026-27 కొరకు అడ్మిషన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. కావున, అర్హులై న విద్యార్థులు www.tgms .telang ana.gov.in వెబ్సైట్ ద్వారా 28.01 .2026 నుండి 28.02 .2026 వరకు దరఖాస్తు చేసుకోగలరు. అడ్మిషన్ టెస్ట్ 19.04.2026 న 6 వ తరగతి కి ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, మరియు 7 వ తరగతి నుండి 10 వ తరగతి కి మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించబడును.

ఫీజు వివరములు :

OC విద్యార్థులకు 200 రూపాయలు

SC, ST, BC, PwD (PHC) & EWS విద్యార్థులకు 125 రూపాయలు

# ఎన్టీఆర్ కళాశాలలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం



**మహబూబ్ నగర్3( సమయం న్యూస్) :** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి డాక్టర్ టి చేతనారెడ్డి గైనకాలజిస్ట్ ఆర్వీఆర్ హాస్పిటల్ మహబూబ్నగర్ గారు మాట్లాడుతూ మనమంతా ప్రతి విషయానికి ఏఐపై ఆధారపడడం వలన మానసిక మేధస్సు పై ప్రభావం చూపుతుంది దైనందిన జీవితంలో సరైన సమయానికి ఆహారం, నిద్ర, సోషల్ మీడియా ఎక్కువగా వాడటం, అలానే ఇతరుల దగ్గర ఇలాంటి విషయాలు పంచుకోకుండా ఒంటరిగా ఉండటం వలన నిరాశకు గురికాబడి ప్రవర్తన లోపాలు ఆహార రుగ్మతల వల్ల వంటి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. మహిళల్లో రుతు చక్రం కారణంగా నాలుగు హార్మోన్ల అస్థిరత వలన వారిలో ఆరు ముండ్ల అసమతుల్లత ఏర్పడి చిన్న విషయాలకే అతిగా స్పందించడం వంటి మానసిక సమస్యలకు గురి కావడం, ప్రస్తుతం 15 నుండి 29 సంవత్సరాల వయసున్న పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనివల్ల దేశాభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం కొరకు దైనందిన జీవితంలో సరైన వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, కొద్ది మొత్తంలోనే కెఫిన్ మరియు ఆల్కహాల్ తీసుకోవడం, క్రమం తప్పకుండా నిద్రపోవడం, సామాజికంగా అందరితో కలిసి పోవడం, మనకు అనుకూలమైన వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం, అధిక మోతాదులో మెడిసిన్స్ తీసుకోకపోవడం వలన ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో దానిని నిర్లక్ష్యం చేయకుండా ఎలా సంరక్షించుకోవాలో విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్. అమాన ముంతాజ్ జహాన్, ప్రిన్సిపాల్. డాక్టర్. పద్మ అనురాధ, ఇ.క్యూ.ఏ.సి. కో.ఆర్డినేటర్ డాక్టర్. జె. శ్రీదేవి, జంతుశాస్త్ర విభాగాధిపతి. డాక్టర్. యం. ప్రవీణ్ కుమార్, మహిళా సాధికారత ఇంచార్జ్. వాసంతి, డాక్టర్. పి. విజయలక్ష్మీ, జంతుశాస్త్ర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు.

## కే రామకృష్ణ రావు.



హైదరాబాద్ ఫిబ్రవరి3( సమయం న్యూస్) కంప్లయెన్స్ తగ్గింపు, డీ-రెగ్యులేషన్ (Compliance Reduction & Deregulation) సంస్కరణలపై ఉన్నత స్థాయి సమావేశం నేడు సచివాలయంలో నిర్వహిం చబడింది. ఈ సమావేశానికి ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ రావు అధ్యక్షత వహించగా, భారత ప్రభుత్వ కార్యదర్శి శ్రీమతి సుకృతి లేఖి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ అధికారులు, కంప్లయెన్స్ తగ్గింపు మరియు డీ-రెగ్యులేషన్ సంస్కరణల ఫేజ్--I అమలులో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రశంసనీయమైన ప్రగతిని అభినందించారు. అదే ఉత్సాహంతో ఫేజ్--IIలోనూ రాష్ట్రం విజయవంతంగా ముందుకుసాగుతుం దనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. ఫేజ్--I లో భాగంగా మొత్తం 23 ప్రాధాన్య రంగాలు, అలాగే 5 ఐచ్ఛిక ప్రాధాన్య రంగాలు గుర్తించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ దశలో విధానాలను మరింత సరళీకృతం చేయడం, వ్యాపార సౌలభ్యాన్ని (ఋఖంవ శీట ఐశీఱఅస్త్ర దీబంఱఅవం) పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకు ముందుగానే సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని భారత ప్రభుత్వ కార్యదర్శికి హామీ ఇచ్చారు. సంస్కరణల అమలుకు అవసరమైన చట్టపరమైన సవరణలను రాబోయే శాసనసభ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టేలా సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశం ద్వారా జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా నియంత్రణా సంస్కరణలను వేగవంతం చేయడం, పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం స్పష్టమైంది. ఈ సమావేశంలో ఎంఏ ఊ యూడీ మరియు వైఏటీ ఊ సీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేశ్ రంజన్, పరిశ్రమలు ఊ వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ అహ్మద్ నదీమ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి శ్రీ లోకేశ్ కుమార్, ఎంఏయూడీ కార్యదర్శి శ్రీమతి టి.కె. శ్రీదేవి, రెవెన్యూ (సీటీ ఊ ఎక్సైజ్) శాఖ కార్యదర్శి శ్రీ రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు



# అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహణ

**సంగారెడ్డి ఫిబ్రవరి3( సమయం న్యూస్) :** అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా ప్రాంగణం, సంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరియు యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మరియు అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు మరియు ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ మరియు సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు.

కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు మరియు సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన పెంపొందించబడింది.





# ప్రభుత్వాసుపత్రుల్లో గర్భస్త ప్రసవాలు జరగాలి.

**జగదేవ్ పూర్. ఫిబ్రవరి03( సమయం న్యూస్). :** జిల్లాలో గర్భస్థ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగేలా ప్రతి ఒక్కరు పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బంది ఎఎన్ఎం లను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆదేశించారు. మార్కుక్ మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల అన్ని గదులు తనికి చేశారు. ఇప్పటివరకు ఎంత ఓపి చూశారని మెడికల్ ఆరా తీశారు. వైద్య పరికరాలు మందులు సమకూర్చుకుని రోగులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయవేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశిం చారు .ఆయా గ్రామాల్లోని గర్భస్థ మహిళల ఆరోగ్య స్థితి గతులను పర్యవేక్షణ చెయ్యాలని ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకోవాలని ప్రైవేట్ ఆసుపత్రికి ఒక్క మహిళ కూడా వెళ్లకుండా పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్ మరియు ఏ ఎన్ ఎం లను ఆదేశించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డాక్టర్ మరియు సిబ్బంది పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డి ఎం అండ్ ఎచ్ ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు

## ప్రచారంలో ముందంజలో ఉన్న టిఆర్ఎస్.



**చేవెళ్ల, ఫిబ్రవరి,03: (సమయం న్యూస్) :**చేవెళ్ళ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ..17 వ వార్డు కౌన్సిలర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న కడమంచి ఆనంద్ గెలుపు కోసం చేవెళ్ళ మాజీ ఎంపీపీ మల్గారి విజయభాస్కర్ రెడ్డి 17 వ వార్డులో ప్రచారాన్ని నిర్వహించారు. 17 వ వార్డులోని భగత్ సింగ్ నగర్, రంగారెడ్డి నగర్, అలాగే సీపీఐ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. 17 వార్డులో బీ ఆర్ ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన అన్నారు. ఓ సీనియర్ జర్నలిస్టు అయిన ఆనంద్ లాంటి వ్యక్తి ప్రజలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశ్యంతో రావడం మంచి తరుణమని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. 17 వ వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

**యాలాల మండలం, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం కూకట్ గ్రామానికి చెందిన ఎండి ఫర్జానా జబిన్ భర్త మహమూద్ 45( స.) వచ్చి ఇచ్చిన ఫిర్యాదు ఏమనగా తన భర్త మహమూద్ తండ్రి ఉమర్ సాబ్ వయసు 48 సంవత్సరాలు వృత్తి గవర్నమెంట్ టీచర్ (రాసనమ్ హై స్కూల్) మంగళవారం కోకట్ లో గల తమ పిండి గిర్ని రిపేర్ ఉండడంతో సరి చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి ప్రమాదవశాత్తుగా మరణించడం జరిగిందని ఇట్టి మరణం పై ఎలాంటి అనుమానం లేదని భార్య ఎండి ఫర్జనా ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలన..

- ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా,ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని
- ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నాం
- ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియెగించుకోవాలి
- కోస్గి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)సైదులు




**కోస్గి మున్సిపల్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో కోస్గి సీఐ సైదులు, ఎస్సై బాలరాజు లు కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు మరియు కౌంటింగ్ సెంటర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మంగళవారం జిల్లా ఎస్పీ వినీత్ అదేశాల మేరకు కోస్గి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 07 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని గుర్తించి, ఆయా కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత, కౌంటింగ్ సెంటర్ వద్ద చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను సవివరంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల రోజు చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న భద్రతా పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, పోలింగ్ సిబ్బంది మరియు ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని కోస్గి సీఐ సైదులు అధికారులకు సూచనలు చేశారు. అదే విధంగా ఎన్నికల అనంతరం కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

## ఏ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకోవాలి.

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యపేట ఫిబ్రవరి3( సమయ్దం న్యూస్) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వి.సి హాల్ నందు జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లతో మున్సిపల్ ఎన్నికల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7,8,9 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలో సంబంధిత మున్సిపాలిటీకి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన తదుపరి సాధారణ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, కావున అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు బీఫాంలు అందజేత.

**కోస్గి మున్సిపల్, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు రెబల్ అభ్యర్థుల బెడద లేకుండా పూర్తిగా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ నుండి ఒకే అభ్యర్థిని ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఏనుముల తిరుపతి రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు బీఫామ్ లు అందించారు.ఈసందర్భంగా జిల్లా కాగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కోస్గి మున్సిపల్ లోని 16 వార్డులు గెలిచి ముఖ్యమంత్రికి గిఫ్ట్ గా ఇవ్వాలని అందుకు అనుగుణంగా పనిచేయాలని నాయకులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని అన్నారు. వందల కోట్ల రూపాయలతో ఇప్పటికే మున్సిపల్ వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని,కోస్గిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయం ప్రజలకు వివరించలని అన్నారు.అదే విదంగా జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వార్ల విజయకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలన్నారు.కోస్గి మున్సిపల్ లో 16 వార్డులలో పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు సహకారం అంధించాలని అన్నారు.కోస్గి ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కోస్గి మున్సిపాలిటీ సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువరన్ రెడ్డి. మాజీ సర్పంచ్ నాగులపల్లి నరేందర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నకిష్టప్ప, మాసుల నరసింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు..



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి పై సమీక్షి.

- **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరు,కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి ( కొడంగల్ నియోజకవర్గం)లోని మండలాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి పై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు,ఎంపీఓలు,హౌసింగ్ ఏ ఈ లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు.మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యం చేరుకున్న లక్ష్యం పై సుదీర్ఘంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజక పరిధిలోని మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యం వంద శాతం సాధించాలని ఆదేశించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులను కలిసి దశల వారీగా నిర్మాణం చేయించి బిల్లులు ఇప్పించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఒక్కో గ్రామానికి మంజూరైన ఇండ్లు, ప్రస్తుతం అవి ఏ దశల్లో ఉన్నాయనే పూర్తి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.నిర్మాణాలలో వెనకబడిన గ్రామాలలో వారం రోజుల్లో పురోగతి సాధించేందుకు ప్రయత్నం చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కోస్గి మండలంలోని గ్రామాలకు ఇచ్చిన ఇండ్ల టార్గెట్ లో 100 శాతం నిర్మాణాలను ప్రారంభింపజేసిన సర్జఖాన్ పేట, చెన్నారం గ్రామాల కార్యదర్శులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.ఆ గ్రామాలలో వంద శాతం నిర్మాణాలు ఎలా ప్రారంభింప చేశారో వెనకబడిన గ్రామాల కార్యదర్శులకు తెలిపి వారు కూడా పురోగతి సాధించేందుకు సహకరించాలని కోరారు. కొడంగల్ నియోజక వర్గంలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉందని, అంతలోపు అధికారులు తమకు ఇచ్చిన లక్ష్యాన్ని 90 శాతమైన సాధించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఆస్తి పన్నులు వసూలు, పారిశుద్ధ్యం పై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీవో లు, ఎంపివోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ స్మైల్105 మంది చిన్నారులకు విముక్తి

**ఖమ్మం పోలీస్ కమిషనర్**

**ఖమ్మం ఫిబ్రవరి 3 : ( సమయం న్యూస్ ) :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహిం చిన ఆపరేషన్ స్మైల్ -12 ద్వారా 105 మంది చిన్నా రులకు విముక్తి కల్పించామని, 29 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. 2026 జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన పన్నెండోవ 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమంలో నోడల్ అధికారి అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం, ఏసీపీ సాంబ రాజు, యాంటీ హుమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పోలీసు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, కార్మిక, విద్య, ఆరోగ్య శాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చీ+రా అధికారులు పాల్గొన్నారని తెలిపారు. బాలకార్మికులు, చిన్నారుల దుర్భర స్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకొని వాటిని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించామన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, బస్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్ళు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆపరేషన్ స్మైల్లో చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సత్ఫలితాలనిచ్చిందని పేర్కొన్నారు. అనేక మంది తప్పిపోయిన పిల్లలను దర్పణ్ అప్లికేషన్ సాయంతో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారని అన్నారు. రాష్ట్రాల చిన్నారుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు అప్పగించారని వివరించారు. పిల్లలను అక్రమంగా తరలించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. చిన్నారులను రక్షించేందుకు ఒక్కొక్క డివిజన్ లో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఏఎస్సై ఇద్దరు కానిస్టేబుళ్లు (మహిళా అధికారితో సహా) తో కూడిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలు తనిఖీలు చేపట్టిన్నట్లు తెలిపారు.గత ఏడాది ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 53 మందిని, ఈ ఏడాది 105 మంది చిన్నారులకు విముక్తి కల్పించి తల్లిదండ్రుల చెంతకు చేర్చామన్నారు.ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేసిన అధికారులకు ప్రశంస పత్రాలు పోలీస్ కమిషనర్ అందజేశారు.



# సేంద్రియ సాగు అన్ని విధాల మేలు.

**ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి**

**కోస్గి మండలం, ఫిబ్రవరి,03(సమయం న్యూస్) :** మీర్జాపూర్ లో విద్యార్థుల క్షేత్ర పర్యటన వ్యవసాయ సాగులో సేంద్రీయ పద్ధతులు పాటించడం అన్ని విధాలుగా ఎంతో మేలని విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్త్ క్లబ్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం వ్యవసాయ పొలాల దగ్గర రైతులను కలుసుకున్నారు. వరి సాగులో అధిక శాతం యూరియా వాడటం వల్ల ఆరోగ్యాలతో పాటు పర్యావరణం పై చూపుతున్న దుష్ప్రభావాలను వారికి వివరించారు. ప్రమాదకర రసాయన మందులు, ఎరువులకు బదులుగా సహజ క్రిమిసంహారక మందులు ఎరువులు వాడాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. అవసరానికి మించి రసాయన మందులు పిచికారీ చేయడం నేల సారవంతం కోల్పోయి కాలుష్య భరితంగా మారుతున్నదని వివరించారు. అదనపు ఆదాయం కోసం రైతులు నిర్వహిస్తున్న వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను సందర్శించారు.పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, గొర్రెల పెంపకం వంటి రంగాలు రైతులకు ఉపయోగపడుతున్న తీరు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు వాటి పనితీరు గురించి తెలుసుకున్నారు. ఆర్థిక భారం తగ్గించడంతోపాటు సమయాన్ని ఆదా చేయడం కూలీల కొరతను అధికమించడంలో తోడ్పడుతున్న వివిధ రకాల ఆధునిక వ్యవసాయ పనిముట్లను వాటి పనితీరును పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తులు సవాళ్లు.. అనే పాఠ్యాంశ బోధనలో భాగంగా అదనపు ప్రత్యక్ష అవగాహన కోసం ఎంపిక చేసుకున్న ప్రాజెక్ట్ కోసం ఈ క్షేత్ర పర్యటన జరిగిందని పాఠశాల ఎర్త్ క్లబ్ సమన్వయ కర్త వార్ల మల్లేశం తెలిపారు.పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జనార్ధన్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఫిబ్రవరి 5న బెంగళూరుతో ఫైనల్

# ఫైనల్లో ఢిల్లీ

## గుజరాత్‌పై ఘన విజయం

ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలుపు

### షఫాలీ, లిజెల్ లీ మెరుపు ఆరంభం.. బెత్ మూనీ పోరాటం వృథా



**వడోదర, ఫిబ్రవరి 3:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మంగళవారం వడోదర వేదికగా జరిగిన కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టును 7 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి, వరుసగా నాలుగోసారి ఫైనల్‌లో అడుగుపెట్టింది. అటు బౌలింగ్‌లోనూ, ఇటు బ్యాటింగ్‌లోనూ సమష్టిగా రాణించిన ఢిల్లీ.. గుజరాత్‌కు ఏ దశలోనూ కోలుకునే అవకాశం ఇవ్వలేదు.

**మూనీ పోరాడినా.. భాగస్వామ్యాలు కరువు**

టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ వ్యూహం ఫలించింది. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ ఆరంభం నుంచే తడబడింది. ఓపెనర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అయితే గుజరాత్ కెప్టెన్ బెత్ మూనీ (62 నాటౌట్) ఒక వైపు వికెట్లు పడుతున్నా.. బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆమెకు జార్జియా వేర్‌హామ్ (35) నుంచి కాస్త సహకారం లభించింది. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ ఢిల్లీ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో గుజరాత్ భారీ స్కోరు చేయలేకపోయింది. ఢిల్లీ బౌలర్లలో చినెల్ హెన్రీ 3 వికెట్లు పడగొట్టి గుజరాత్ పతనాన్ని శాసించగా, నందని శర్మ 2 వికెట్లతో సత్తా చాటింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో గుజరాత్ 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**షఫాలీ, లిజెల్ లీ మెరుపులు..**



169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఛేదనను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, లిజెల్ లీ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పవర్ ప్లే ఓవర్లలో ఫోర్లు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 89 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేశారు. లిజెల్ లీ 43 పరుగులు చేయగా, షఫాలీ వర్మ 31 పరుగులతో మెరిసింది. వీరిద్దరూ అవుటైన తర్వాత కూడా ఢిల్లీ జోరు తగ్గలేదు.

**మధ్యలో జెమీమా క్లాస్..**

ఓపెనర్లు ఇచ్చిన ఆరంభాన్ని మిడిలార్డర్ బ్యాటర్లు జెమీమా రోడ్రిగ్స్, లారా వోల్వార్డ్ చక్కగా కొనసాగించారు. జెమీమా 41 పరుగులతో క్లాస్ ఇన్నింగ్స్ ఆడగా, లారా వోల్వార్డ్ 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్‌ను ముగించింది. గుజరాత్ బౌలర్లు ఏ దశలోనూ ఢిల్లీ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టలేకపోయారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 15.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 169 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

**ఫైనల్ ఫైట్ అప్పుడే..**

ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఇప్పటికే ఫైనల్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఫిబ్రవరి 5న (గురువారం) జరిగే తుది పోరులో ఢిల్లీ తలపడనుంది. టైటిల్ కోసం ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.



## భారత్ దయ మీదే పాకిస్తాన్ బతుకు

**నిజం ఒప్పుకున్న పాక్ మాజీ ఛైర్మన్**

**స్పోర్ట్స్ డెస్క్, ఫిబ్రవరి 04 :** పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆర్థిక పరిస్థితిపై ఆ దేశ మాజీ ఛైర్మన్, మాజీ క్రికెటర్ రమీజ్ రాజా సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ క్రికెట్ మనుగడ పూర్తిగా భారత్ డబ్బులపైనే ఆధారపడి ఉందని పరోక్షంగా అంగీకరించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పీసీబీకి వచ్చే ఆదాయంలో సగానికి పైగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచే వస్తుందని రమీజ్ రాజా తెలిపారు. అయితే ఇక్కడ అసలు విషయం ఏంటంటే.. ఐసీసీకి వచ్చే మొత్తం ఆదాయంలో దాదాపు 90 శాతం డబ్బు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) నుంచే వెళ్తోందని ఆయన వెల్లడించారు. ఐసీసీ ఆదాయంలో భారత్ పాత్ర అత్యంత కీలకమని, ఒకవేళ బీసీసీఐ నిధులు ఇవ్వడం ఆపేస్తే.. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆర్థికంగా కుప్పకూలే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. రాజకీయంగా భారత్‌తో గొడవలు పెట్టుకుంటూనే, క్రికెట్ పరంగా మాత్రం పరోక్షంగా భారత డబ్బులపై ఆధారపడటం పాక్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాక్ ప్రకటించిన నేపథ్యంలో రమీజ్ రాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మ్యాచ్‌లను బహిష్కరిస్తే పాక్ అన్ని విధాలా నష్టపోతుందని ఆ దేశ మాజీలే మండిపడుతున్నారు. రమీజ్ రాజా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. పాకిస్తాన్ ఓవరాక్షన్ చేస్తున్నా.. వారి బతుకు మాత్రం ఇండియా చేతిలోనే ఉందని కామెంట్ చేస్తున్నారు. క్రికెట్‌లో రాజకీయాలు పక్కన పెట్టి ఆటపై దృష్టి పెడితే మంచిదని హితవు పలుకుతున్నారు.

## తారాజువ్వలా ఇషాన్ కిషన్

**గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్**

**టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?**

**అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్**



టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

## డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

**సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి**




మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్‌కే ఫ్రాంచైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంచైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంచైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, దిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.

## సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ



అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్-10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 36వ ర్యాంకుకు చేరుకుంది. ఇక ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ మూడో స్థానంలో ఉండగా, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. సౌతాఫ్రికా ప్లేయర్ సునే లూస్ కూడా బ్యాటింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది.



## టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు.. పార్ట్ 2, పార్ట్ 3లతో రాబోతున్న భారీ సినిమాలు!

ఒకప్పుడు సినిమా అంటే ఒక పార్ట్‌తో ముగిసిపోయే కథ. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెలుగు ప్రేక్షకులు ఎక్కువగా వినని "సీక్వెల్" అనే పదం ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత వినిపిస్తున్న మాటగా మారింది. ఒక హిట్ సినిమా వస్తేడ దానికి రెండో భాగం, మూడో భాగం తీసే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. దర్శకులు, హీరోలు, నిర్మాతలు అందరూ ఇప్పుడు సీక్వెల్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. ప్రేక్షకుల్లోనూ అదే ఆసక్తి కనిపిస్తుండటంతో ఇది ఇండస్ట్రీలో ఓ కొత్త ట్రెండ్‌గా మారింది. ఫ్యామిలీ ఎమోషన్‌తో కూడిన క్రైమ్ థ్రిల్లర్‌గా 'దృశ్యం' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వెంకటేష్ నటించిన 'దృశ్యం', 'దృశ్యం 2' రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు 'దృశ్యం 3' కోసం సిద్ధమవుతున్నారు. మలయాళ వెర్షన్ ఇప్పటికే పూర్తయి విడుదలకు రెడీగా ఉండగా, హిందీ వెర్షన్ షూటింగ్ దశలో ఉంది. రెండో భాగం ముగిసిన దగ్గర నుంచే మూడో భాగం ప్రారంభమవుతుందని సమాచారం. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే 'కల్కి 2', 'సలార్ 2'. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్‌డ వాటి తర్వాత 'కల్కి 2'ను మొదలు పెట్టి, ఆపై 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే 'సలార్ 2' పట్టాలెక్కే అవకాశం ఉంది.ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'దేవర 2' స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. 'జాంబిరెడ్డి 2', 'జై హనుమాన్', 'మిరాయ్ 2' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'జై హనుమాన్'లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి. 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ 'జుచీజు రిపీట్' పేరుతో రాబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన 'మ్యాడ్' సిరీస్ ఇప్పటికే రెండు భాగాలతో విజయం సాధించగా, ఇప్పుడు 'మ్యాడ్ జూనియర్స్' రూపొందుతోంది. హారర్ థ్రిల్లర్ 'పొలిమేర 3'ను పాన్ ఇండియా స్థాయిలో తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా 'పుష్ప 3', 'కార్తికేయ 3', 'టిల్లు క్యూబ్', 'కేజీఎఫ్ 3' వంటి ప్రాజెక్టులు కూడా భవిష్యత్తులో రాబోతున్నాయి. వీటిపై అధికారిక ప్రకటనలు ఆలస్యమవుతున్నాడ ప్రేక్షకుల్లో మాత్రం భారీ ఆసక్తి ఉంది. మొదటి భాగం విజయాన్ని కొనసాగించడం సీక్వెల్‌లకు పెద్ద సవాలే. కథ, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటేనే ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చు. అయితే ట్రేడ్ వర్గాల అభిప్రాయం ప్రకారండ రాబోయే సీక్వెల్స్ కూడా విజయవంతమైతే టాలీవుడ్‌లో ఈ ట్రెండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశముంది.

## ధనుష్ కొత్త సినిమాలో ఇద్దరు హీరోయిన్లు



తమిళ ఇండస్ట్రీలో సీనియర్ హీరోగా గుర్తింపు ఉన్న ధనుష్, వరుస సినిమాలతో దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. మంచి కాన్సెప్ట్‌తో ఎప్పుడు ప్రేక్షకులను అలరించే హీరో ధనుష్, ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియా సామి దర్శకత్వంలో కొత్త సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు ఇంకా టైటిల్ ఫైనల్ కాలేదు. ఆ 55 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. అమరన్ లాంటి సినిమాతో సక్సెస్ అందుకున్న రాజ్ కుమార్, ధనుష్ కోసం అద్భుతమైన కథ సిద్ధం చేశాడట. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ అని ఇప్పటికే ప్రకటించారు. పోస్టర్ రిలీజ్ చేసింది చిత్రం బృందం. అటు మమ్ముట్టి స్పెషల్ రోల్ చేయబోతున్నారట.తమిళ హీరో ధనుష్, శ్రీ లీల కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా ఉన్నట్లు తాజాగా ప్రకటించింది చిత్ర బృందం. సాయి పల్లవిని కూడా ఈ ప్రాజెక్టులో ఇన్వాల్వ్ చేస్తున్నారు. అంటే ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లతో హీరో ధనుష్ స్టెప్పులు వేయనున్నాడు. అయితే ఇందులో సాయి పల్లవి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుందని టాక్ నడుస్తోంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఆమెను చూస్తారట. అందుకే సాయి పల్లవిని ఆ పాత్ర కోసం మాత్రమే దర్శకుడు రాజ్ కుమార్ తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఇందులో మెయిన్ హీరోయిన్ సాయి పల్లవి ఉంటుందా? లేక శ్రీలీల ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది. కాగా ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీత స్వరాలు అందిస్తున్నారు. 2027లో ఈ సినిమా రిలీజ్ అయ్యే ఛాన్స్ లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా, ఉండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ ఆధ్వర్యంలో వస్తోంది.

## ఊహించలేనన్ని ట్విస్టులతో..



చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ మూవీని ఈ నెల6న గ్రాండ్‌గా రిలీజ్ చేయ-ంబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు జయంత్ సి పరాన్జీ, జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హీరో చంద్రహాస్ మాట్లాడుతూ,'ధృవన్ చాలా టాలెంటెడ్. ఈ చిత్రం కోసం అద్భుతమైన పాటల్ని అందించాడు. ఈ సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించిన చిన్ని, చందు, వెంకీకి, ఈ ప్రాజెక్ట్ నాకు రావడానికి కారణమైన కెమెరామెన్ శేఖర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టకుండా ఉంటుంది. లెక్కపెట్టలేనన్ని, ఊహించలేనన్ని ట్విస్ట్‌లతో అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు అలా కూర్చుని చూస్తుండిపోతారు. సంపత్ ఈ మూవీని గొప్పగా తీశారు. నన్ను బాగా చూపించారు' అని అన్నారు. 'ఈ సినిమాతో చంద్రహాస్‌కు మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నాను. ఈ మూవీని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని ఆది సాయి కుమార్ అన్నారు. జయంత్ సి పరాన్జీ మాట్లాడుతూ,'ఈ టైటిల్‌లోనే యాటిట్యూడ్, కాన్ఫిడెన్స్, పొగరు ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది' అని చెప్పారు. సంపత్ రుద్ర మాట్లాడుతూ, 'నిర్మాత వెంకీ నా క్లాస్ మేట్. అతను లేకపోతే ఈ చిత్రం లేదు. చందు, చిన్ని తరువాత ఈ ప్రాజెక్టులోకి వచ్చారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటి వరకు ఇలాంటి ఓ కమర్షియల్ చిత్రం రాలేదు. క్లైమాక్స్ చూసి అందరూ షాక్ అవుతారు. ఆ షాక్ నుంచే థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని తెలిపారు. 'నాకు బుజ్జి లాంటి మంచి పాత్రను ఇచ్చిన సంపత్‌కి థ్యాంక్స్. చంద్రహాస్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ధృవన్ మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది' అని మేఘన ముఖర్జీ చెప్పారు.

## మా పాత్రలు నవ్విస్తాయి, ఏడిపిస్తాయి



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి ట్రైలర్ రానే వచ్చింది. హగ్గులు, ముద్దులతో ఫుల్ రొమాంటిక్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రజెంట్ నెట్టింట సందడి చేస్తుంది. ఇక ఈ ట్రైలర్ ఈవెంట్‌లో హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'యూవీ క్రియేషన్స్ నా ఫ్యామిలీ లాంటిది. ఈ బ్యానర్ లో వచ్చే ప్రతి సినిమా మాది అనుకుంటాం. డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ చేయబోయే ఎన్నో మంచి చిత్రాల్లో మొదటిదిగా "కపుల్ ఫ్రెండ్లీ" రిలీజ్ కు వస్తోంది. నేను చిన్న గ్యాప్ తీసుకున్న మాట నిజమే. ఈ సారి నేను చూపించబోయే కథ ఇరవై ఏళ్ల పాటు మీకు గుర్తుండిపోవాలి అనుకుని ఈ సినిమా చేశాను. శివ అనే క్యారెక్టర్‌కు ఒక జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తా. శివ నెల్లూరు నుంచి వచ్చిన అబ్బాయి, మిత్ర చిత్తూరు నుంచి వస్తుంది. వాళ్లు చెన్నైలో కలుస్తారు. చెన్నైలో షూటింగ్ చేయడం బ్యూటిఫుల్ ఎక్సిపీరియన్స్ ఇచ్చింది. శివ, మిత్ర అనే పాత్రలు మిమ్మల్ని నవ్విస్తాయి, కదిలిస్తాయి. కాస్త ఏడిపిస్తాయి. "కపుల్ ఫ్రెండ్లీ" ఒక జెన్యూన్ ఇంటెన్షన్‌తో హానెస్ట్ గా చేసిన సినిమా. ఇది నా కెరీర్‌లో గుర్తుండిపోయే మూవీ అవుతుంది' అన్నారు. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తుండగా.. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## 'ధురంధర్ 2' ఎఫెక్ట్.. వాయిదా దిశగా అడివి శేష్ 'డెకాయిట్'?




టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ'. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రం తాజాగా వాయిదా పడనుందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే అదే సమయంలో బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'తో పాటు కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీ నెలకొంది. ఈ భారీ చిత్రాల మధ్య థియేటర్ల లభ్యత, కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో 'డెకాయిట్' చిత్రాన్ని ఏప్రిల్ 10, 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ బాక్సాఫీస్ క్లాష్ గురించి అడివి శేష్ స్పందిస్తూ తమ సినిమా పెద్ద చేపల మధ్య ఒక 'గోల్డ్ ఫిష్' లాంటిదని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సోలో రిలీజ్ కోసం వెతకడమే శ్రేయస్కరమని టీమ్ భావిస్తోంది. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీపై అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131